www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శుక్రవారం | 09 | అక్టోబర్ | 2026

పేజీలు : 8


## నేడు ఆర్టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు





-బస్సు, కాగడకే మొగ్గు

-ఏడు డిపోలు, 1,789 మంది ఓటర్లు




**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఈనెల తొమ్మిది దిన శుక్రవారం కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు జరగనున్నాయి. ఖమ్మం రీజియన్ పరిధిలో ఏడు డిపోలు ఉండగా మొత్తం 1,789 మంది ఓటర్లు ఉన్నారు. ఎంప్లాయీస్ యూనియన్, ఎన్‌ఎంయు, టిఎంయులు ఒక కూటమిగా పోటీ చేస్తున్నాయి. మిత్రపక్షాల ఒప్పందంలో భాగంగా ఖమ్మం రీజియన్‌లో స్థానిక గుర్తింపును ఎన్‌ఎంయుకు కేటాయించారు. రాష్ట్ర గుర్తింపుకు సంబంధించి ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ టిఎంయు, ఎన్‌ఎంయు మద్దతుతో ఉంది. ఖమ్మం రీజియన్‌లో కార్మికులు ఎంప్లాయీస్ యూనియన్ గుర్తు బస్సు, స్థానిక గుర్తింపుకు సంబంధించి ఎన్‌ఎంయు కాగడ వైపే మొగ్గు చూపుతున్నారు. గతంలో గుర్తింపు సంఘంగా ఉండి కార్మికులను వంచించిన సంఘాల పట్ల కార్మికులు విముఖత చూపుతున్నారు. గడిచిన పదేళ్లుగా ఆర్టిసి కార్మికుల సమస్యలపై కనీసం పెదవి విప్పని

మిగతా 2లో..

## జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే..




-ఖమ్మంలో నినదించిన ఇండియా కూటమి

-పెద్ద సంఖ్యలో పాల్గొన్న వామపక్ష, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు, విద్యార్థి, యువజనులు

-సిపిఎ సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనని విపక్షాలు నినదించాయి. తప్పుడు మార్గంలో ఎన్నికలు నిర్వహిస్తున్న పద్ధతిని మార్చాలని డిమాండ్ చేశాయి. ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ గురువారం ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెవిలియన్ మైదానం నుంచి మయూరిసెంటర్

మిగతా 2లో..

## ఓటు హక్కుపై దాడిని తిప్పికొడదాం




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే పాలకుల అణచివేత చర్యలను ప్రజాతంత్ర శక్తులు ఐఖ్యంగా తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని, ఎన్నికల కమీషన్

మిగతా 2లో..

- రాజ్యాంగ వ్యవస్థల రక్షణకు సమిష్టిగా పోరాడుదాం
- సర్ ప్రక్రియ వెనుక దాగున్న కుట్రలను బహిర్గతం చేయాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా
- సర్‌కు నిరసనగా ఇండియా కూటమి భారీర్యాలీ




# జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)



పాత బస్టాండ్ మీదుగా జెడ్పి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీని ఉద్దేశించి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ జ్ఞానేష్‌కుమార్ ఎన్నికల అధికారిలా కాకుండా బిజెపి కార్యకర్తలా వ్యవహరించారని ఆరోపించారు. ఆయన నిర్వహించిన ఎన్నికల అన్నింటికి సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మోడీ ప్రజా మద్ధతుతో గెలవలేక ఎన్నికల సంఘాన్ని తన గెలుపుకోసం వాడుకున్నారని ఆయన తెలిపారు. ఎన్నికల కమిషనర్‌గా మోడీ, అమిత్‌షాలు తమ ఏజెంటును నియమించుకున్నారన్నారు. కోట్లాది మంది ఓట్లను తొలగించడం ద్వారా ప్రజాస్వామ్య అస్థిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చారని హేమంతరావు ఆరోపించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ బిజెపి ఓట్ల చోరీకి పాల్పడుతుందని ఓటర్ల జాబితాలో అవకతవకలు, ఈవిఎంలో చోటు చేసుకున్న మాయ బిజెపికి గెలుపుకు కారణమయ్యాయన్నారు. జ్ఞానేష్ కుమార్ పదవిలో ఉండటానికి అనర్హుడని తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణులు ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాయని ఈ పోరాటంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, ప్రత్యామ్నాయ పౌర సమాజం బాధ్యులు గోపగాని శంకర్‌రావు తదితరులు ప్రసంగించగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, కాంగ్రెస్ నాయకులు పోట్ల నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుంబూరు దయాకర్ రెడ్డి, తుమ్మల యుగంధర్, కట్ల రంగారావు, సిపిఎం నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై. విక్రం, యర్రా శ్రీనివాస్, మాస్‌లైన్ నాయకులు ఆవుల అశోక్, జన సమితి నాయకులు గోపగాని శంకర్ రావు, కాంగ్రెస్ నాయకురాలు దొబ్బల సౌజన్య, బచ్చలకూరి నాగరాజు, బాలాజీ నాయక్, సిసిఏ బాధ్యులు కాకి భాస్కర్, విజయ్, యువజన విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై దాడిని తిప్పికొడదాం

(మొదటిపేజీ తరువాయి)



జ్ఞానేష్ కుమార్‌ను భర్తరఫ్ చేయాలని అక్రమంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ సిపిఎం, కాంగ్రెస్, న్యూడెమోక్రసీ మాస్‌లైన్, జనసమితి పార్టీల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఓల్డ్ డిపో సెంటర్ నుండి ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం రైల్వేస్టేషన్ సెంటర్లో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక ఓటు హక్కును కాలరాసే విధంగా సాగుతున్న సర్ ప్రక్రియను తక్షణమే నిలిపేయాలన్నారు. వివాదం సుప్రీం కోర్టు పరిధిలో ఉండగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం గర్హనీయమని, తొలగించిన అర్హుల ఓట్లను వెంటనే చేర్చకపోతే రాజీలేని ఉద్యమాలు నిర్వహిస్తామని, శ్రమజీవుల, పీడితప్రజల కనీస రాజకీయ హక్కు అయిన ఓటును సర్ ప్రక్రియ ద్వారా కొల్లగొట్టే కుట్ర సాగుతోందన్నారు. పాలకవర్గాల అడుగులకు మడుగులొత్తుతూ పనిచేస్తున్న ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుండి తొలగించడమే ప్రజాస్వామ్యానికి రక్షణ అన్నారు. అనంతరం జిల్లాకాంగ్రెస్ అధ్యక్షురాలు తోట లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన ఓటు హక్కును నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.చట్టబద్ధమైన నిబంధనలు పాటించకుండా ఏకపక్షంగా చేపట్టిన సర్ ప్రక్రియ రాజ్యాంగ విరుద్దమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ నిష్పాక్షికతను కోల్పోయి ఏకపక్షంగా వ్యవహరించడం శోచనీయం అన్నారు. అక్రమంగా అర్హుల ఓట్లను బాబితాల నుండి తొలగించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు. అనంతరం మేయర్ మూడ్ గణేష్, మాస్‌లైన్ , జనసమితి నాయకులు కెచ్చల రంగారెడ్డి గౌని నాగేశ్వరరావు, కవిత, దేవదానం మాట్లాడుతూ సాంకేతికత పేరిట సామాన్య ప్రజల ఓట్లను గల్లంతు చేయడం ముమ్మాటికీ ప్రజాద్రోహమే అన్నారు. దేశంలో ఎన్నికల నిర్వహణ అత్యంత పారదర్శకంగా జరగాల్సిన చోట ఇలాంటి అనుమానాస్పద సర్వేలను తెరపైకి తేవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టులోని కేసుల విచారణను పరిగణలోనికి తీసుకోకుండా మొండిగా ముందుకెళ్లడం పాలకుల అహంకారానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, సిపిఐ నాయకులు కల్లూరి వెంకటేశ్వ్రరావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, కమటం వెంకటేశ్వరరావు, జీ వీరస్వామి, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే ఫహీమ్, సిపిఎం నాయకులు ఏజే రమేష్ తో పాటు ముద్దా బిక్షం, తుపాకుల నాగేశ్వరరావు, సిపిఐ సిపిఎం కాంగ్రెస్, ఎంఎల్ పార్టీ నాయకులు కార్యర్తలు, అభిమానులు ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఆర్టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

వారు ఏ సమస్యను పట్టించుకోని వారు ఇప్పుడు అది చేస్తాం ఇది చేస్తామని హామీలు ఇస్తుంటే కార్మికులు నమ్మే పరిస్థితి లేకుండాపోయింది. కార్మిక సంఘాలను ఆర్టిసిలో రద్దు చేసిన తర్వాత ఎంప్లాయిస్ యూనియన్ కూటమి వివిధ రూపాల్లో పెద్ద ఎత్తున పోరాటం చేసింది. మిత్రపక్షాలతో కలిసి కూటమిగా ఏర్పడి సమ్మెకు సైతం సిద్దమైంది. సమ్మెతో కొన్ని హామీలను నెరవేర్చడం జరిగింది. ఇప్పుడు గుర్తింపు సంఘం ఎన్నికలు కూడా ఎంప్లాయిస్ యూనియన్ కూటమి పోరాట ఫలితంగానే జరుగుతున్నాయి. ఆర్టిసి కార్మికుల ముందు విలీనం, విలీన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వంతో జరిగిన ఒప్పందాల్లో ఎవరిని ఎంచుకుంటే తమకు లబ్ది చేకూరు తుందని తమ హక్కులు కాపాడబడతాయన్న ఆలోచన ఉన్నది. అధికార పార్టీకి తొత్తు సంఘాలుగా ఉన్న వాటికి గుర్తింపునిస్తే రేపు విలీన ప్రక్రియ సక్రమంగా ముగియకపో వడంతో పాటు కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. తొత్తు సంఘాలు అధికార పార్టీకి, ప్రభుత్వానికి తానా దందానా అంటే ఆర్టిసి సంస్థ భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకమ వుతుంది. ఈ దశలో ఎన్నికలలో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి గుర్తింపు అనివార్య మవుతుంది. కార్మికులు సైతం అదే ఆలోచనలో ఉన్నారు. ఖమ్మం రీజియన్‌లో 637 మంది డ్రైవర్లు, 830 మంది కండక్టర్లు, 178 మంది గ్యారేజీ స్టాఫ్, ఇతరులు 144 మంది ఉన్నారు. మొత్తం 1789 మంది ఓటర్లు శుక్రవారం ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. డిపోల వారీగా ఖమ్మం డిపోలో అత్యధికంగా 422, కొత్తగూడెం డిపోలో 176, భద్రాచలంలో 333, సత్తుపల్లిలో 295, మధిరలో 188, మణుగూరు 240, ఇల్లెందులో 106, ఆర్ఎం కార్యాలయం ఖమ్మంలో 29 మంది ఓటర్లు ఉన్నారు. విధులలో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఏ డిపోకు ఆ డిపోలనే ఎన్నికలను నిర్వహిస్తారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు




**ప్రజాపక్షం/మధిరః** మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా కళవబూల ప్రాంగణంలో విద్యార్థినిలు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను పేర్చి సాంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీక అని అన్నారు. తెలంగాణ సంప్రదాయాలను ,సంస్కృతి వారసత్వాన్ని విద్యార్థులు కాపాడుతూ భావితరాలకు అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎస్.ఇందిర, డాక్టర్ పి.సుజాత, అధ్యాపకులు పి.లక్ష్మీ నారాయణ, డాక్టర్ వి.నాగరాజు, డాక్టర్ ఎంవిఎస్.శర్మ, పి.శ్రీనివాస్, షేక్ ఇమ్రాన్, ఎస్.జ్యోతి, టి.ఆదర్శ్, ఎస్.పృథ్వీరాజ్, పి.నాగేశ్వరరావు, తదితరులు, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/మధిరః** శ్రీనిధి డిగ్రీ కళాశాలలో ఐసిటిసి సెంటర్, ఏరియా హాస్పిటల్ మధిర ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీనిధి విద్యాసంస్థల అధినేత వై.అనిల్‌కుమార్ నెహ్రూ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఐసిటిసి సెంటర్, ఏరియా హాస్పిటల్ మధిర కౌన్సిలర్ పి.సల్మాన్‌రాజా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ చర్యలు, ముందస్తు పరీక్షలు చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కెసిపి పొల్లయ్య స్వచ్ఛంద సేవా సంస్థ మధిర శాఖ తరపున అవుట్‌రీచ్ వర్కర్లు సుజాత, రాధా పాల్గొని విద్యార్థులకు ఎయిడ్స్‌పై వగాహన కల్పించారు. విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి, సమాజంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ఉన్న అపోహలను తొలగించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ శంకుస్థాపన ఏర్పాట్లు పరిశీలన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన ఏర్పాట్లను ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. గురువారం అల్లిపురం కొత్తగూడెం సమీపంలో నూతనంగా నిర్మించనున్న ఆలయ శంకుస్థాపన ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. ఈనెల 12న శంకుస్థాపన (భూమిపూజ) జరగనున్న నేపథ్యంలో అతిథులు, భక్తులు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనిల్, సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, అధికారులు, నల్లమల ఆనంద్ పాల్గొన్నారు.

## తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలి

**-ఎల్‌నినో ప్రభావంతో తగ్గిన భూగర్భ జలాలు**

**-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యాసంగిలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను ఎంచుకోవాలని ఖమ్మంజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం తెలిపారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఈ ఏడాది వర్షపాత లోటు ఏర్పడిందని, ప్రాజెక్టులు, చెరువుల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేవని కలెక్టర్ తెలిపారు. కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేసే అవకాశం లేనందున రైతులు కాలువ నీటిపై ఆధారపడి పంటలు వేసి నష్టపోవద్దన్నారు. అందుబాటులో ఉన్న పరిమిత నీటిని భవిష్యత్తు తాగునీటి అవసరాలకే అధిక ప్రాధాన్యత నివ్వాల్సి ఉంటుందన్నారు. భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గినందున బోరు బావుల క్రింద విస్తృతంగా వరి వేయడం వల్ల భూగర్భ జలాలపై భారం పడుతుందన్నారు. వరి స్థానంలో పెసర, మినుము, కంది వంటి పప్పు ధాన్యాలతో పాటు పొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. డ్రిప్, స్ప్రింకర్లు వంటి సూక్ష్మ నీటిపారుదల పద్దతులను పాటించి నీటి వృథాను అరికట్టాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలు, నీటి పొదుపుపై రైతు వేదికల ద్వారా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



## సర్వేను వినియోగించుకోండి : తహసీల్దార్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** భూమి సమస్యల పరిష్కారానికి పాత రికార్డులు, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను నిజమైన హక్కు దారులకు న్యాయం జరిగేలా చర్యల్లో ప్రభుత్వం రీ సర్వే ప్రారంభించింది. పెనుబల్లి మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద తుమ్మలపల్లి లో సర్వే సిబ్బంది సర్వే ను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ దివాకర ఆదేశాలతో గురువారం తహశీల్దార్ వీర భద్ర నాయక్ తుమ్మలపల్లి గ్రామంలో రీ సర్వేను పరిశీలించారు. గ్రామంలో భూ రీసర్వే ప్రక్రియ, భూ సమస్యల పై రైతులకు అవగాహన కల్పించారు. తుమ్మల పల్లి గ్రామంలో మొత్తం 699 ఎకరాలు ఉన్నాయి. ఇందులో 154 ఎకరాలు చెరువులు, కుంటలు, రోడ్లు ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వీరభద్ర నాయక్, ఆర్ఐ సక్రు, సర్వేయర్ ఈశ్వరి, సర్పంచ్ బుడ్డియ్య, కొప్పుల వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు,రైతులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులు, ఉద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ : లింగాల



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను, సమస్యలు పరిష్కరిస్తామని ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసి చేసిందని మధిర నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజు ఆరోపించారు. ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వాటి అమలుపై మాట దాటవేస్తోందని విమర్శించారు. రాబోయే పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత, ఉద్యోగులు, పట్టభద్రులు కాంగ్రెస్ పాలనపై తమ అభిప్రాయాన్ని వెల్లడించనున్నారని అన్నారు. గురువారం ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, బూత్‌స్థాయి ఏజెంట్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కమల్‌రాజు మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, ఇతర హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో స్పష్టత ఇవ్వడం లేదని కమల్‌రాజు విమర్శించారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న యువతకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఇటీవల కూడా నిరుద్యోగ పట్టభద్రులు ఉద్యోగ నోటిఫికేషన్లపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారన్నారు. బూత్‌స్థాయి నుంచే ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కమల్‌రాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి శీలం కవిత, మండల కార్యదర్శి యన్నం శ్రీనివాస్‌రెడ్డి, తోట శ్రీనివాసరావు, సర్పంచ్ వేల్పుల బెంచిమెన్, నాయకులు గూడూరు రమణారెడ్డి, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కుడుముల మల్లికార్జున్‌రెడ్డి, బొర్ర నర్సింహారావు, శ్రీపాలశెట్టి తిరుపతిరావు, గద్దల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
















# టీబీ రహిత గ్రామాలకు అవార్డులు




**ప్రజాపక్షం/చింతకాని :** ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఖమ్మం జిల్లాలో టీబీ నిర్మూలనకు వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యకమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. 202425 సంవత్సరాలలో ఒక్క టీబీ కేసు కూడా నమోదు కాని గ్రామాలను టీబీ రహిత గ్రామాలుగా చింతకాని మండలం అనంతసాగర్, కొదుమూరు, రేపల్లెవాడ, పందిళ్లపల్లి గ్రామాలను గుర్తించి ఆయా గ్రామ సర్పంచ్‌లకు గురువారం జిల్లా కేంద్రంలో వైద్యాఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుమాధవ్, జిల్లా టీబీ అధికారి నివేదిత, సర్పంచ్‌లు , వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.










# నారాయణపురం భూ సమస్యలను పరిష్కరిస్తాం : కలెక్టర్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలోని భూ సమస్యలను పాత రెవెన్యూ రికార్డులు, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని నారాయణపురంలో భూ రీసర్వే, సీలింగ్ భూముల సమస్యలపై నిర్వహించిన గ్రామసభలో రైతులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. భూ రీసర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితి, సాగులో ఉన్న విస్తీర్ణం తదితర వివరాలను గుర్తిస్తున్నామని తెలిపారు. పాత పహాణీలు, సీలింగ్ భూముల రికార్డులు, పట్టాలు, భూ బదలాయింపులు, సాదాబైనామాలు తదితర ఆధారాలను పరిశీలించి నిజమైన హక్కుదారులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. రీసర్వేకు సంబంధించి అభ్యంతరాలు, సందేహాలు ఉన్న రైతులు అక్టోబర్ 15 లోగా ఆధారాలతో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. సర్వేలో ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, మండల ప్రత్యేక అధికారి ముజాహిద్, తహసీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్‌లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.






# సీతారామ, సత్తుపల్లి ట్రంక్ పనులు వేగవంతం చేయాలి



**-భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి**
**-రైతులకు పరిహారం అందించాలి**
**-మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ**
**-ప్రాజెక్టులు పూర్తయితే తాగు, సాగునీటికి భరోసా**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు రైతుల భూములను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం, సత్తుపల్లి ట్రంక్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనులు, భూ సేకరణ, పైపులైన్ నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సత్తుపల్లి ట్రంక్ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరాన్ని మంత్రి తుమ్మల వివరించారు. ట్రంక్ పనులు పూర్తయితే సత్తుపల్లి, వేంసూరు మండలాల పరిధిలో సాగు, తాగునీటి అవసరాలను తీర్చే అవకాశం ఏర్పడుతుందన్నారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పుడు ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా కల్పించడంలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా లంకాసాగర్ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇటీవల నీటిని విడుదల చేసిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తులపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పైపులైన్, టన్నెల్ పురోగతిపై చర్చించారు. రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయడం, భూసేకరణ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

# విద్యార్థి కుటుంబానికి ఎస్‌బిఐటి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థి కుటుంబానికి ఎస్‌బిఐటి కళాశాల ఆర్థిక చేయూతనందించింది. ఎస్‌బిఐటి కళాశాలలో సిఎస్‌ఈ ఎఐఎంఎల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పోనుగంటి శ్రీకాంత్ గతేడాది నవంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ కుటుంబానికి అండగా ఉండేందుకు కళాశాల తరుపున రెండు లక్షలు గురువారం విద్యార్థి తండ్రి పోనుగంటి శ్రీనుకు అందజేసినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శ్రీకాంత్ మృతి తమను తీవ్రంగా కలిచివేసిందని ఆ కుటుంబానికి సానుభూతి తెలపడంతో పాటు వారి ఆర్థిక స్వాలంబన నిమిత్తం కళాశాల తరుపున ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించామన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ గత మూడేళ్లుగా తమ కళాశాలలో విద్యార్థుల సింగిల్ పేరెంట్, విద్యార్థుల ఆకస్మిక మృతి వంటి కారణాల వల్ల కుటుంబం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కళాశాల తరుపున రెండు లక్షలు అందజేసి ఆదుకుంటున్నామన్నారు. ఖమ్మం జిల్లా వరద బీభత్సంలో నాయకన్‌గూడెంకు చెందిన విద్యార్థి తల్లిదండ్రులను కోల్పోవడం, తల్లిని కోల్పోయిన విద్యార్థికి గతంలో ఆర్థిక సాయం అందించినట్లు వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల వల్ల, ప్రమాదవ శాత్తు తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు తమ కళాశాల అండగా ఉంటుందని తెలిపారు. విద్యకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవివి శివప్రసాద్ పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం

**9మంది గర్భిణీలకు సీమంతాలు,**
**చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని రైతువేదికలో పోషణ మాసం సంబరాలను పట్టణ, మండల స్థాయిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, సిడిపివో కృష్ణశ్రీ మాట్లాడుతూ గర్భాధారణ నుంచి శిశువు తొలి వెయ్యి రోజుల వరకు తీసుకునే పోషకాహారం ఎంతో కీలకమని వివరించారు. గర్భిణీలు పోషకాహారం ఎంతో కీలకమని వివరించారు. గర్భిణీలు రక్తహీనతకు గురికాకుండా ఐరన్‌తో కూడిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అనుబంధ పోషకాహారం అందించడం, తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఆరు నెలలు పూర్తయిన చిన్నారులకు అన్నప్రాసన, మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అలాగే 9 మంది గర్భిణీలకు సంప్రదాయబద్ధంగా సీమంతాలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్మన్ కాపా చంద్రకళ, సిఎంసివో పోషణ అభియాన్, డిసి బాబు పాల్గొన్నారు. సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, సరితతో పాటు పోషణఅభియాన్ సిబ్బంది, డిహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు. పోషకాహారంపై ప్రతి కుటుంబంలో అవగాహన పెంపొందించి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.

## తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలకం : ఎమ్మెల్యే జారె



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని రైతు వేదికలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పోషణమాసం ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం ఎంతో కీలకమని అన్నారు. చిన్నారులకు చిన్న నాటి నుంచే సమతుల్యమైన, పౌష్టిక విలువలు కలిగిన ఆహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఆరోగ్యవంతమైన తల్లి, శిశువు, సమాజం లక్ష్యంగా పోషణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పోషకాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఎమ్మెల్యే జారె పరిశీలించారు. చిరు ధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తదితర ఆహార పదార్థాల పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను అంగన్వాడీ సిబ్బంది వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల బరువు, ఎదుగుదలను పర్యవేక్షించడం, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించటం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జూపల్లి రమేష్‌బాబు, ఆత్మ కమిటీ ఛైర్మన్ సుంకవల్లి వీరభద్రం, మున్సిపల్ కౌన్సిలర్లు, ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది, మహిళలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి విముక్త గ్రామంగా కొడవటిమెట్ట



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల పరిధిలోని కొడవటిమెట్ట గ్రామం టిబి (క్షయ) వ్యాధి లేని గ్రామంగా ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన TB MUKT BHARATH ABHIYAN లో భాగంగా గురువారం ఖమ్మంజిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్య అధికారుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేశారు. గ్రామంలో టిబి వ్యాధి నివారణకు పాలక వర్గం, ఆశ వర్కర్ ఏఎన్ఎం, వైద్య సిబ్బంది చేసిన కృషికి ఈ అవార్డు లభించిందన్నారు. గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించి ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేయటం వల్ల ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి సర్పంచ్ తిరుమల్‌రావు ధన్యవాదాలు తెలిపారు.

# తల్లాడలో ఉచిత ఆరోగ్య పరీక్షలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** గ్రామసభలో ప్రజలు కోరిన మేరకు తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఐదవ వార్డులో సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజారోగ్య శాఖ సహకారంతో గురువారం ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రత్యూష ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు బిపి, మధుమేహ పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ బిపి, మధుమేహం వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా తగిన వైద్య సలహాలు, చికిత్స పొందవచ్చునని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఐదవ వార్డు సభ్యురాలు గుంటుపల్లి కుమారి, సొసైటీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సహాయక నర్సులు, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి బస్సును ఢీకొన్న కారు

**తప్పిన ప్రమాదం**



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో తల్లాడ ప్రధాన రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తల్లాడలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ కారు, ఆర్‌టిసి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగంగా పాక్షికంగా ధ్వంసమైంది. ప్రమాద సమయంలో కారులో ఇద్దరు ప్రయాణీకులు ఉన్నారు. అయితే అదృష్టవశాత్తు వారిద్దరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై సహాయ చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు, సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. ప్రమాద సమయంలో వాహనాల వేగం, డ్రైవర్ల అప్రమత్తత తదితర అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రధాన రహదారిపై ప్రమాదం జరగడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

# 12న వైరా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**సమావేశం సక్రమంగా జరుగుతుందా? కౌన్సిలర్ల వైఖరిపై ఆసక్తి**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం ఈ నెల12వ తేదీన సోమవారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశ సమయం దాటిపోవడంతో పాటు మున్సిపాలిటీలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల నేపధ్యంలో సమావేశం వరుసగా వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపధ్యంలో సోమవారం సమావేశం నిర్వహించేందుకు మున్సిపల్ కమిషనర్ కౌన్సిలర్లకు సమాచారం అందించారు. అయితే ఈ సారైనా కౌన్సిల్ సమావేశం సజావుగా జరుగుతుందా? అన్నది ప్రస్తుతం వైరాలో చర్చనీయాంశంగా మారింది. గతంలో చోటు చేసుకున్న పరిణామాల నేపధ్యంలో ఈ సమావేశంపై రాజకీయ వర్గాలతో పాటు పట్టణ ప్రజల్లోను ఆసక్తి నెలకొంది. మరోవైపు సమావేశంలో ప్రవేశపెట్టనున్న వివిధ అంశాలు, తీర్మానాలపై కౌన్సిలర్ల వైఖరి ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. కౌన్సిలర్లంతా సమావేశానికి హాజరై తీర్మానాలకు ఏకగ్రీవంగా మద్దతు ఇస్తారా? లేక కొన్ని అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వ్యతిరేకిస్తారా? అనేది వేచిచూడాల్సిందే. మొత్తం ఈ నెల12న జరగనున్న వైరా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాధారణ సమావేశంగానే ముగుస్తుందా? అనేది వేచిచూడాల్సిందే.

# కబడ్డీ పోటీలకు సిద్ధమైన క్రీడా ప్రాంగణం

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్రస్థాయి అండర్ 20 కబడ్డీ పోటీలకు క్రీడా ప్రాంగణం ఎమ్మెల్యే జారె దినారాయణ దగ్గరుండి సర్వం సిద్ధం చేయిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కబడ్డీ క్రీడా పోటీలను ఎమ్మెల్యే స్వతహాగా నిర్వహించడం అశ్వారావుపేట నియోజకవర్గంకు ఎంతో ప్రతిష్టను తీసుకురానుంది. ఆయన గతంలో పిఈటిగా పనిచేయడం వల్ల క్రీడల పట్ల ఆయనకున్న అనుభవాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని యువతలను క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు రాష్ట్ర స్థాయి అండర్ 20 బాలికల క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయాన్ని వ్యక్త పరుస్తున్నారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రోడ్లో క్రీడా ప్రాంగణంలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులకు వసతి ఏర్పాట్లతో పాటు వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఆయనతో పాటు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జూపూడి రమేష్, ఇతర నాయకులు తదితరులు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రీడలు నియోజకవర్గానికి గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# వైద్యసేవల్లో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు



- వైద్య సిబ్బంది ఓపి సమయాలను పాటించాలి
- వైద్యసేవలపై నిరంతరం పర్యవేక్షణ అవసరం
- కలెక్టర్ అంకిత్

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు వైద్యసిబ్బంది అంతా సమన్వయంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. గురువారం వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన శాఖాధికారులతో సమీక్ష నిర్వహించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపి సమయాలను వైద్యులతో పాటు సిబ్బంది అంతా పాటించాలని, అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం వాటిల్లకుండా వైద్యులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాల్వంచ, రామవరం, అశ్వారావుపేట భద్రాచలం బూర్గంపాడు తదితర ప్రాంతాల్లో వైద్యసేవల పరిస్థితిని సమీక్షిస్తూ ప్రతీ అంశాన్ని అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనాల పనులు, అదనపు పడకలసామర్థ్యం అవసరమైన వైద్యపరికరాలపై కలెక్టర్ సమీక్షించారు. ఆస్పత్రి ప్రాంగణాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యసేవలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలకు అందించే వైద్యసేవల్లో నాణ్యత సమయపాలన బాధ్యతతో కూడిన సేవలు ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ రవిబాబు, జిల్లా ఏరియా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి : డిఈఓ

ప్రజాపక్షం/చింతకాని : చింతకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామసర్పంచ్ కిలారు మనోహర్‌బాబు పాఠశాల మైదానం లోతు కువగా ఉండటంతో వర్షపు నీరు నిలిచి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల సమస్యలపై ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డిఈవో గురువారం పాఠశాలను సందర్శించి సర్పంచ్ , స్థానిక పెద్దలతో కలిసి సమస్యపై చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పాఠశాలలో నెలకొన్న టాయిలెట్ల సమస్యను సైతం డిఈవో దృష్టికి తీసుకువెళ్లగా ప్రాథమిక పాఠశాలలో అదనంగా న్న టాయిలెట్లను విద్యార్థినులు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండలంలో జరుగుతున్న 9వ తరగతి మూల్యాంకన ప్రక్రియను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్‌బాబు, ఎంఈవో సలాది రామారావు, సీసీ మాధవరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉషా మహలక్ష్మి, సీత , వార్డు సభ్యులు కిలారు బాబురావు, పొనుగోటి బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సెలవుల్లో బడులు నడిపే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి





- విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి
- నిబంధనలు మీరితే ప్రత్యక్ష ఆందోళనలు
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : దసరా సెలవుల్లో ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్ చేస్తూ తరగతులు నిర్వహించే ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యాశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన సెలవులను సైతం పట్టించుకోకుండా విద్యార్థులను పాఠశాలలకు రప్పించి తరగతులు నిర్వహించడం దుర్మార్గమన్నారు. దీనివల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని ఆవేదనవ్యక్తం చేశారు. దీనిపై విద్యాశాఖాధికారులు వెంటనే స్పందించి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల తీరుపై తల్లిదండ్రులు చేస్తున్న ఫిర్యాదులపై విచారణ జరిపి విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను హక్కులను కాలరాస్తూ సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్షపోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్ జిల్లా సమితి సభ్యులు జుంజునూరి రాజ్‌కమల్ నాయకులు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ రఘురాంరెడ్డిపై లాఠీచార్జ్‌ని ఖండిస్తున్నాం



ప్రజాపక్షం/కూసుమంచి: ఓటు చోరీ ఆరోపణలపై కేంద్రం సమాధానం చెప్పాలని, సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన నిరసనలో పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డిపై పోలీసుల లాఠీచార్జ్‌ను కూసుమంచి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బోడ వీరునాయక్ తీవ్రంగా ఖండించారు. ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రజాప్రతినిధిపై లాఠీ చార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఎన్నికలపై ప్రశ్నలు తలెత్తితే కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ప్రశ్నించే గొంతును బలప్రయోగంతో అణచడం సరికాదని అన్నారు. లాఠీచార్జ్‌తో ప్రజల ఓటు హక్కు కోసం రఘురాంరెడ్డి చేస్తున్న పోరాటాన్ని ఆపలేరని బోడ వీరునాయక్ పేర్కొన్నారు.

### రాకపోకలకు

## రాళ్లబంధం వాగు దారి..!

-వాగును చదును చేసి రాకపోకలు పునరుద్ధరణ



ప్రజాపక్షం/నేలకొండపల్లి : వరద ఉధృతికి కొట్టుకుపోయిన రాళ్లబంధం వాగు దారి ఎట్టకేలకు బాగుపడింది. దీంతో చెరువుమాధారంమంగాపురంతండా మధ్య గురువారం నుంచి రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. ఇటీవల చెరువుమాధారం చెరువు అలుగు పోయడంతో వచ్చిన వరదలకు వాగు దెబ్బతిని రహదారి పూర్తిగా తెగిపోవడంతో రాయగూడెం, చెరువుమాధారం, మంగాపురం తండా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ మార్గం ద్వారా ఏపీలోని వివిధ ప్రాంతాలకు వల్లభి మీదుగా రాకపోకలు సాగించే వారికి కూడా తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రజల ఇబ్బందులను గుర్తించిన మంగాపురంతండా సర్పంచ్ ధీరావత్ అశోక్‌రాణి జేసీబీతో రోడ్డును చదును చేయించి మట్టిని తొలగించారు. చెరువుమాధారం సర్పంచ్ అమరగాని యల్లయ్య పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించే పనులు చేపట్టారు. అదే విధంగా చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. దీంతో వాగు దారి తాత్కాలికంగా అందుబాటులోకి వచ్చి రాకపోకలు సాగుతున్నాయి. ప్రజల ఇబ్బందులను గుర్తించి స్పందించిన ఇరువురు సర్పంచ్‌లకు, సహకరించిన వారికి పలు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## నిరాహార దీక్షకు సంఘీభావం



ప్రజాపక్షం /గుండాల : మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసు పత్రిలో వైద్యులు లేక రోగులు నానా అవస్థలు పడుతున్న జిల్లా వైద్యాధికారులకు చీమకుట్టినట్లుగా కూడ లేదని మాస్‌లైన్ పార్టీ మండల కార్యదర్శి కొమరం శాంతయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండోవరోజు ఆస్పత్రి ముందు నిరవధిక నిరాహార దీక్ష సిపిఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ సంఘీభావం ప్రకటించారు. కొమరం శాంతయ్య, పివైఎల్ జిల్లా అధ్యక్షులు పూనెం మంగయ్యలు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రజలకు అత్యవసరమైన వైద్యం అందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం అని, డిఎంఅండ్ హెచ్ఓ, స్థానిక ఎమ్మెల్యేను ప్రశ్నించారు. మండల ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేలా చేయాల్సిన బాధ్యతా అధికారులు, ప్రజాప్రతినిధులపై ఎంతైనా ఉందన్నారు. ప్రజలు ఆందోళన కార్యక్రమం చేపట్టినా స్పష్టమైన పరిష్కారం ఎందుకు చూపడంలేదని ప్రశ్నించారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు ప్రజా ఉద్యమానికి తమ మద్దతును కొనసాగిస్తామని పేర్కొన్నారు. సంఘీబావం తెలిపిన వారిలో ఇల్లందు డివిజన్ పార్టీ కార్యదర్శి ఈసం శంకర్ , శ్రావన్, తెల్లం రాజు, జగన్, క్రిష్ణ, గడ్డం రమేష్, విమల్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే చిన్నారులకు ఆరోగ్యం



ప్రజాపక్షం/తిల్లపల్లి: చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని జీసీడీవో అలివేలు మంగతాయారు అన్నారు. పౌష్టికాహారంతో పిల్లల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. మైలారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు సమతుల్య, పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. ఇక్రిశాట్ సీనియర్ శాస్త్రవేత్తలు వై వినోద్, ఈ కిరణ్, కె క్రాంతి మాట్లాడుతూ ఐటీడీఏ పీఓ బి రాహుల్ సహకారంతో గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న 7 నుంచి 10 ఏళ్ల పిల్లల ఆహారంలో చిరుధాన్యాలను చేర్చాల్సిన అవసరాన్ని వివరించారు. రాగులు, జొన్నలు, సజ్జలు వంటి చిరుధాన్యాలతో పిల్లల ఆరోగ్యం, శారీరక ఎదుగుదల మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జోగ రాంబాబు, జి కుమార్ రాజా, చీమల భద్రమ్మ, ఎస్‌సీఆర్‌పీ నెహ్రూ, కృష్ణ, జోగ సావిత్రి, తదితరులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్, అఖిలపక్షాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న నాయకత్వంలో ర్యాలీ చేపట్టారు. ఈకార్యక్రమానికి బూర్గంపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేశారు.

## టీబీ రహిత గ్రామ పంచాయితీగా రుక్కీ తండా



ప్రజాపక్షం/కామేపల్లి : మండలంలోని రుక్కీ తండా గ్రామ పంచాయితీ టీబీ రహిత గ్రామ పంచాయితీగా ఎంపికైంది. గురువారం నిర్వహించిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ నివేదిక, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వేణు చేతుల మీదుగా సర్పంచ్ రమాదేవి అవార్డు అందుకున్నారు. డాక్టర్ నివేదిత మాట్లాడుతూ దేశాన్ని టీబీ రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను అమలు చేస్తోందన్నారు. 2030 కంటే ముందే టీబీని నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టీబీ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమాచారం అందించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ గ్రామ పంచాయితీ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నామని, ప్రజలకు విద్య, వైద్యం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## హనుమంతుకు సీపీఐ నాయకుల ఘన నివాళి



ప్రజాపక్షం/కారేపల్లి:మండల కేంద్రానికి చెందిన చింతల హనుమంత దశదిన కర్మకు సీపీఐ నాయకులు హాజరై ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జితేందర్ రెడ్డి, జిల్లా మహిళా సంఘం నాయకులు ఏపూరి లతాదేవి, సీతామాలక్ష్మి, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబాబు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు పుచ్చకాయల శ్రీనివాసరావు, తురక మల్లేష్, ఉంగరాల సుధాకర్, రామస్వామి, ధనరాజ్, నరసయ్య, సావిత్రి, సుధాకర్, ఎండి రియాజ్, టౌన్ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సింగరేణిలో ఎంఎల్‌సీ ఓటరు నమోదుపై అవగాహన

ప్రజాపక్షం/కారేపల్లి: గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు బానోత్ మనీషా లక్ష్మీ మదన్‌లాల్ శుక్రవారం సింగరేణి మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలలోపు బస్టాండ్ సెంటర్‌కు ప్రజలు, పట్టభద్రులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేరుకోవాలని మాజీ జెడ్పిటిసి వాంకుడోత్ జగన్ నాయక్ కోరారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎంఎల్‌సీ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# దోపిడీకి పాల్పడుతున్న కాంగ్రెస్ నేతలు

**-పట్టభద్రుల ఎంఎల్‌సి గెలుపే లక్ష్యం**
**-ఓటరు నమోదును ఉద్యమంలా చేపట్టాలి**
**-100 ఓట్లకు ఒక కో ఆర్డినేటర్ నియామకం**
**-సమన్వయ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లాలో భూములు, మట్టి, బైరటీస్ వంటి సహజ వనరుల దోపిడీకి కాంగ్రెస్ నేతలు పాల్పడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. రాబోయే ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం నగరంలోని పువ్వాడ అజయ్‌కుమార్ స్వగృహంలో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఖమ్మం నియోజక వర్గంలో ప్రస్తుతం 28,500 ఓట్లు ఉన్నాయని ప్రతి 100 ఓట్లకు ఒక సమన్వయకర్త ( కోఆర్డినేటర్) 325 మందికి బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. ఎస్ఐఆర్ తరహాలో ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన పట్టభద్రుల వివరాలు సేకరించాలన్నారు. డివిజన్ల వారీగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఓటు నమోదు ప్రక్రియను ఉధృతం చేయాలన్నారు. తానే స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటానని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్యులు, న్యాయవాదులు, బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు, డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు పూర్తయిన ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. గతంలో పల్లా రాజేశ్వరరెడ్డికి ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఖమ్మం నియోజక వర్గం నుంచే అత్యధికంగా పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించి విజయంలో కీలక పాత్ర పోషించామన్నారు. అదే ఉత్సాహంతో ఈసారి కూడా పని చేయాలన్నారు. పట్టభద్రుల ఎన్నికలు రాబోయే కార్పోరేషన్, స్థానిక ఎన్నికలకు నాంది అన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్థి విజయం కోసం కష్టపడి పనిచేయాలన్నారు. కాంగ్రెస్ నేతలు గిరిజన భూములను కబ్జా చేస్తూ అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారని మట్టి, బైరటీస్ వంటి వనరులను అక్రమంగా తవ్వి తరలిస్తూ దందాలు సాగిస్తున్నారన్నారు. పార్టీ ఇంచార్జి ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి రవీంధర్‌రావు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటరు నమోదుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా బిఆర్‌ఎస్ శ్రేణులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌జెసి కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, బత్తుల మురళీ, కర్నాటి కృష్ణ, మగ్బూల్, నాగండ్ల కోటేశ్వరరావు, శీలంశెట్టి వీరభద్రం, జ్యోతిరెడ్డి, రోజ్‌లీనా, బుడిగెం శ్రీను, బుర్రి వెంకటేశ్వర్లు, బిక్కసాని జశ్వంత్, పసుమర్తి రాంమోహన్‌రావు, తోట రామారావు, మాటేటి నాగేశ్వరరావు, మెంతుల శ్రీశైలం, వీరునాయక్, పిన్ని కోటేశ్వరరావు, గుత్తా రవి, మద్దినేని వెంకటరమణ, కొంటెముక్కులవెంకటేశ్వర్లు, మెంటెం రామారావు, సర్పంచులు పాల్గొన్నారు.

# మాజీ రెవెన్యూ అధికారి శ్రీరాంరావు మృతి

**-వివిధ రాజకీయ పక్షాల నేతలు, జర్నలిస్టు సంఘాల నేతల నివాళి**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** మాజీ రెవెన్యూ అధికారి పోలీస్ పటేల్, కవి మాటేటి శ్రీరాంరావు(82)బుధవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురై మృతిచెందారు. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన శ్రీరాంరావు తొలుత పోలీస్ పటేల్‌గా పనిచేశారు. ఆ తర్వాత రెవెన్యూ శాఖలో వివిధ హోదాలలో పనిచేసిన శ్రీరాంరావు సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నాడు. కవిగా సమాజ అవగాహనతో పలు రచనలు చేశారు. శ్రీరాంరావుకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు మాటేటి వేణుగోపాల్ సీనియర్ జర్నలిస్టుగా టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనిచేస్తున్నారు. శ్రీరాంరావు మృతివార్త తెలిసిన వెంటనే పలువురు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ రాజకీయ పక్షాల నేతలు, జర్నలిస్టు సంఘాల నేతలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంఎల్‌సి తాతా మధు, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా నాయకులు ఎస్‌కె జానిమియా, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, వివిధ జర్నలిస్టు సంఘాల బాధ్యులు తదితరులు ఆయన భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు తరలి వచ్చి శ్రీరాంరావుకు నివాళులర్పించారు.

# ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి

**-నెలవారీ ఇవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి నెలవారి తనిఖీ చేశారు. ఇవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి అవి పనిచేస్తున్నవి లేనివి అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మోగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారి గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. తనిఖీ రిజిస్టర్లలో కలెక్టర్ సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎంఎ రాజు, డిటి అన్సారీ, అధికారులు పాల్గొన్నారు.

# సిరిపురం మేజర్‌కు సీతారామ నీటిని విడుదల చేసిన ఎంఎల్‌ఎ



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా తరలివచ్చిన గోదావరి జలాలను గురువారం విడుదల చేసింది. తల్లాడ మండలం ఏన్కూరు లాకుల వద్ద అన్నారుగూడెం పరిధిలో సిరిపురం మేజర్ కాలువకు సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ లాంఛనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్‌ఎ రాగమయి మాట్లాడుతూ గత ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వందలాది క్యూసెక్కుల నీటిని తరలించిందని తెలిపారు. కాలువ మరమ్మతుల వల్ల ఇప్పటి వరకు స్వల్ప జాప్యం జరిగినా ఇకపై సాగు నీరు దండిగా అందుతుందని భరోసా ఇచ్చారు. ఈ నీటితో తల్లాడ, కల్లూరు మండలాల్లోని పంట పొలాలు సస్యశ్యామలంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం తల్లాడ పట్టణంలో అర్హులకు నూతన స్మార్ట్‌కార్డులను ఎంఎల్‌ఎ మట్టా రాగమయి పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం పేద వర్గాలకు సన్న బియ్యం అందిస్తూ ఆదుకుంటుందన్నారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి, ఎన్‌ఎస్పి అధికారులు, అన్నారుగూడెం గ్రామశాఖ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, మాజీ స్పంచ్ మమత, మల్లికార్జునరావు దంపతులు, జిల్లా నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రాగమయి దంపతులను గ్రామస్తులు, నాయకులు ఘనంగా సన్మానించారు.

# విద్యార్థుల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యత



**ప్రజాపక్షం/ తల్లాడ :** విద్యార్థుల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యత అని తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు తెలిపారు. తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. భోజన నాణ్యతను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యత అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి విద్యలో రాణించగలరన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు. భోజన తయారీ సమయంలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో సర్పంచ్ ముచ్చటించి వారి చదువు పాఠశాలలోని అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, నాయకులు జివిఆర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విత్తన మొక్కజొన్న సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలి

**అగ్రిమెంట్ తప్పనిసరిగా తీసుకోవాలి : ఏవో మంజుఖాన్**



**ప్రజాపక్షం/వైరా:** యాసంగి సీజన్‌లో విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ సూచించారు. వైరా మండలంలోని సోమవారం, తాటిపూడి గ్రామాల్లో విత్తన మొక్కజొన్న(ఆడ, మగ) సాగు చేసే రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ మాట్లాడుతూ విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు తప్పనిసరిగా సంబంధిత కంపెనీ ఆర్గనైజర్ల నుంచి ముందుగానే అగ్రిమెంట్ తీసుకోవాలని సూచించారు. పంట సాగు చేసిన అనంతరం ఏదైనా నష్టం సంభవించినప్పుడు రైతులకు అగ్రిమెంట్ భరోసా ఉంటుందని తెలిపారు. ఎలాంటి ధారం లేకుండా విత్తన మొక్కజొన్న సాగు చేస్తే నష్టాలు వచ్చిన సమయంలో రైతులు ఇబ్బందులు ఉదెర్కొనే అవకాశం ఉందన్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్ర చేయించుకోవాలని సూచించారు. సోమవరం కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు వ్యవసాయశాఖ అధికారులు సూచించిన నిబంధనలను పాటిస్తూ విత్తన మొక్కజొన్న సాగు చేయాలని కోరారు. ముఖ్యంగా నీటి వసతి, అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను దృష్టిలో పెట్టుకొని పంటను సాగు చేయాలని సూచించారు. తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని మాట్లాడుతూ యాసంగిలోని విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు తప్పనిసరిగా కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే పంట సాగు చేయాలని సూచించారు. అగ్రిమెంట్ లేకుండా సాగు చేయడం వలన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున అగ్రిమెంట్ లభించని రైతులు నాగు మొక్కజొన్న సాగు వైపు మొగ్గు చూపడం మంచిదని తెలిపారు. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని పంటలను ఎంపి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంపటి కీర్తి, కొల్లి హనుమంతరావు, మేడిశెట్టి కాష్, కామసాని రవి, కొల్లి శ్రీనివాసరావు, తాతా రామచందర్‌రావు, జవ్వాజి నాగరాజు, జవ్వాజి వెంకటేశ్వరరావు, బండికోటయ్య, బండి వెంకటేశ్వరరావు, తాతా భాస్కర్‌రావు, తాటిపూడి ఉప సర్పంచ్ షేక్ ఇస్మాయిల్ తదితర రైతులు పాల్గొన్నారు.

# సాంబయ్య మృతి పార్టీకి తీరని లోటు



**ప్రజాపక్షం/ తల్లాడ :** అంజనాపురం గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ శాఖ సభ్యుడు పాకాలపాటి సాంబయ్య మృతి సిపిఎం పార్టీకి తీరని లోటని రాంబాబు తెలిపారు. సాంబయ్య మృతి విషయం తెలుసుకున్న సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి ఆయన మృతదేహంపై పార్టీ జెండాను కప్పి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం డివిజన్ నాయకులు తాతా భాస్కర్‌రావు, విటల్‌రావు, రామలింగేశ్వరరావు, మోహన్‌రావు, కృష్ణయ్య, గోపాలరావు, షేక్ మస్తాన్,శ్రీను,రమేష్, ప్రసాద్, నరేష్, వెంకటయ్య, ప్రకాష్‌రావు, వెంకటనర్సయ్య ఉన్నారు.

# కారేపల్లి అక్రమంపై ఎస్డీసీ విచారణ

**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి గ్రామ పంచాయితీ పరిధిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్లకు ఇంటి పన్ను రసీదులు జారీ చేసిన వ్యవహారంపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం గురువారం సమగ్ర విచారణ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్లు కేటాయించి పన్ను రసీదులు జారీ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఆదేశాల మేరకు సదానందంను విచారణాధికారిగా నియమించారు. ట్రైనీ కలెక్టర్ పరాస్‌కుమార్‌తో కలిసి క్షేత్రస్థాయిలో రేకుల ఇళ్లను పరిశీలించి, నిర్మాణాలకు అనుమతులు, పత్రాలు ఉన్నాయా, పన్ను రసీదులు ఎలా జారీ అయ్యాయన్న అంశాలపై వివరాలు సేకరించారు. విచారణ అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని ఎస్డీసీ సదానందం తెలిపారు.